క్లుప్తంగా

హెడ్ కానిస్టేబుల్ నరసింహకు ఉత్క్రిష్ట్ అవార్డు



ఉప్పల్: ఉప్పల్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జి.నరసింహకు ఉత్క్రిష్ట్ అవార్డు దక్కింది. విధి నిర్వహణలో అత్యుత్తమ పని తీరు కనబరచడంతో పాటు పేదలకు పలు రకాల సేవలు అందించిన నరసింహకు 2022 సంవత్సరానికి గాను ఉత్క్రిష్ట్ (బెస్ట్ ఆఫ్ ది బెస్ట్) అవార్డు లభించింది. ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఉత్తమ సేవలందించే వారికి ఈ అవార్డులను ప్రకటిస్తుంది.

స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతి

కాప్రా: కాప్రా సర్కిల్ ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డ స్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని కోరుతూ శనివారం స్మశాన వాటిక పరిరక్షణ కమిటీ కన్వీనర్ తాడూరి గగన్‌కుమార్ మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జమ్మిగడ్డలోని సర్వే నెంబర్‌-199 స్టేడియం కోసం కేటాయించిన స్థలంలో అంతర్భాగమైన స్మశానవాటిక విషయంలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. తాను మృతిచెందితే జమ్మిగడ్డ స్మశానవాటికలో రెండు గజాల స్థలం కేటాయించాలని వినతిపత్రంలో ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్, మంత్రి కేటీఆర్‌కు, సీఎస్, ప్రిన్సిపల్ సెక్రటరీలకు పోస్ట్ ద్వారా వినతిపత్రం పంపించారు.

వక్ఫ్‌బోర్డు సమస్య పరిష్కారం కాలేదని రాజీనామా

బోడుప్పల్: గత మూడేళ్లుగా వక్ఫ్ బోర్డు సమస్యపై పోరాటం చేస్తున్నా పరిష్కారం లభించకపోవడంతో మనస్తాపం చెందిన అధికార పార్టీ కో ఆప్షన్ సభ్యుడు బుర్ర దత్తాత్రేయశాస్త్రి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బోడుప్పల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లుగా పోరాటం చేస్తున్నా ఫలితం లేదని, కాలయాపన తప్ప సమస్య కొలిక్కి వస్తుందనే నమ్మకం లేదన్నారు. పలుమార్లు అధికారులు, మంత్రి మల్లారెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఇక ఈ సమస్య పరిష్కారమయ్యే సూచనలు కనిపించకపోవడంతో తన రాజీనామాను మెయిల్ ద్వారా మంత్రి మల్లారెడ్డికి పంపినట్లు తెలిపారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చే తీర్మానం హర్షణీయం



బోడుప్పల్: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల బోడుప్పల్ ఆదర్శ క్రైస్తవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కూర్కు రత్నం హర్షం వ్యక్తం చేశారు. బోడుప్పల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ నిర్ణయం సాహసోపేతమైందన్నారు. ఈ నిర్ణయంతో దళిత క్రిస్టియన్లకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీని కోసం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కుషాయిగూడ: కారు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్‌బీకాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హెచ్‌బీకాలనీకి చెందిన గొల్లూరి రమేష్ (36) ఏఎంఆర్ థియేటర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకొని కాలినడకన వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కారు డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేదలకు అండగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



కాప్రాలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హబ్సిగూడ: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. హబ్సిగూడలోని క్యాంపు కార్యాలయంలో కాప్రా మండల తహసీల్దార్ ఎస్తేర్ అనిత, డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి హాజరై పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, జీవో-59 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయం ఆడబిడ్డల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నట్లు తెలిపారు. జీవో-59తో పేదలకు సొంత ఇంటి భరోసా కల్పించడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఆరికంగా బలోపేతం అవుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పజ్జూరి పావనీమణిపాల్‌రెడ్డి, కాప్రా మండల ఆర్‌ఐ ఆనంద్, బీఆర్‌ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, కాసం మహిపాల్‌రెడ్డి, గిరిబాబు, అనిల్‌ముదిరాజ్, రెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం..

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం విషయంలో రాజకీయాలకు తావు లేకుండా అన్ని డివిజన్లకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శనివారం కాప్రా డివిజన్‌లోని అయోధ్యనగర్‌లో రూ.7 లక్షలతో నిర్మించే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్, సప్తగిరి ఎన్‌క్లేవ్‌లో ఓఆర్‌ఆర్, డ్రింకింగ్ వాటర్, హెచ్‌డీపీఈ పైపులైన్ పనులను ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇప్పటికే భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను సైతం త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కృష్ణానగర్‌లో డ్రైనేజీ, బీటీ రోడ్డు వేయించాలని కోరుతూ కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్‌కుమార్, డీజీఎం సతీష్, మేనేజర్ రోహిత్, మాజీ కార్పొరేటర్ పావనీమణిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, సుడుగు మహేందర్‌రెడ్డి, బైరి భాస్కర్, బిస్వజిత్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కార్పొరేటర్‌కు పరామర్శ

కాప్రా: కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి శనివారం ఆస్పత్రికి వెళ్లి కార్పొరేటర్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పావనీమణిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, సుడుగు మహేందర్‌రెడ్డి, పవన్, సుశీల్, బైరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

‘మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటం’

ఉప్పల్: మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత మేకల శివారెడ్డి, ఉప్పల్ సర్కిల్ ఏ-బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉప్పల్ చౌరస్తాకు చేరుకున్నారు. రోడ్డుపై బైటాయించి ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రధాని దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను తుంగలోకి తొక్కి ప్రతిపక్షాల గొంతు నొక్కుతుందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా జనాందోళన్ పేరిట ఉద్యమాలు ప్రారంభమయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ పసుల ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, బోరంపేట కృష్ణ, రఘుపతిరెడ్డి, తవిడబోయిన గిరిబాబు, తెల్కల మోహన్ రెడ్డి, అకారపు అరుణ్, ఎ-బ్లాక్ అధ్యక్షురాలు అమరేశ్వరి, కాలేరు జై నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రంజాన్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



అల్వాల్: రంజాన్ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని నేరేడ్‌మెట్ సీఐ నర్సింహస్వామి అన్నారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో మసీదు కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పండుగ చేసుకోవాలని, పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ కాకతీయ నగర్‌లోని మహంకాళి-శ్రీరామ మందిరం ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి హాజరై కమిటీ సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం ఆలయంలో ఆయన పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి భాగ్యలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు గాయం శ్రీధర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మనోహర్, ప్రతాప్‌రెడ్డి, రమ, పూర్ణచందర్, జ్యోతియాదవ్, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



మల్కాజిగిరి చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న పింఛన్‌దారులు

మల్కాజిగిరి: పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మల్కాజిగిరిలో శనివారం పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జిల్లా కన్వీనర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. పింఛన్‌దారుల సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాజస్తాన్, బెంగాల్, ఛత్తీస్‌ఘ‌ఢ్‌తో పాటు కొన్ని రాష్ట్రాలు పాత పింఛన్ విధానం అమలు చేస్తున్నాయని, తెలంగాణలోనూ ఆ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇరవై సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి పూర్తి పింఛన్, డెత్ రిలీఫ్ ముప్పయి వేలు లేదా నెల పింఛన్ మొత్తంలో ఏది ఎక్కువైతే అది చెల్లించాలని కోరారు. అశోక్, విజయ్‌కుమార్, నర్సింగరావు, రామేశ్వరం, సత్యానంద్, మురళీమోహన్ పాల్గొన్నారు.

రాచకొండ కమిషనరేట్‌లో మెగా ప్లాంటేషన్



మొక్కలు నాటుతున్న పోలీసు అధికారులు

మేడిపల్లి: గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా రాచకొండ పోలీసులు రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎలైట్, న్యూలాండ్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో శనివారం మేడిపల్లి గ్రామం రాచకొండ కమిషనరేట్ స్థలంలో మూడు వేల మొక్కలతో మెగా ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ ఆఫ్ పోలీస్ డీఎస్ చౌహాన్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ.. పర్యావరణంలో ఆక్సిజన్ స్థాయి పెంచడంలో మొక్కల ప్రాముఖ్యత గురించి వివరించారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమానికి హరితహారం కార్యక్రమం ప్రేరణ అని ఆయన అన్నారు. ఎంపీ సంతోష్‌కుమార్ గ్రీన్ ఇండియా చాలెంజ్‌తో తెలంగాణలో అటవీ విస్తీర్ణం, పచ్చదనం పెంచినట్లు తెలిపారు. అటవీ విస్తీర్ణం పెంపులో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎలైట్, న్యూలాండ్ ల్యాబ్స్ ఉద్యోగులు, అరోరా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ టీ-6 టికెట్‌ను సద్వినియోగం చేసుకోండి

కాప్రా: ప్రయాణికులకు చేరువై సంస్థను అభివృద్ధి పథంలో నడిపేందుకు టీఎస్‌ఆర్టీసీ ఎన్నో కార్యక్రమాలతో ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా ప్రయాణికుల కోసం టీ-6 పేరుతో మరో కొత్త ఆఫర్ తీసుకొచ్చింది. ఈ టీ-6 టికెట్ ద్వారా వృద్ధులు నగరంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించే అవకాశం కల్పించింది. ఈ మేరకు కుషాయిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రకాంత్ మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. 60 ఏళ్లు పైబడిన పురుషులు, 50 ఏళ్లు పైబడిన మహిళల కోసం టీఎస్‌ఆర్టీసీ టీ-6 టికెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. 50 రూపాయలతో టీ-6 టికెట్ కొనుగోలు చేస్తే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నగరంలో ఎక్కడికైనా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్టీసీ బస్సులకు వాహన ట్రాకింగ్ వ్యవస్థ

బోడుప్పల్: టీఎస్‌ఆర్టీసీ ప్రయాణికులకు తాము ప్రయాణించాల్సిన బస్సుల వివరాలను సులువుగా తెలుసుకునేందుకు వాహన ట్రాకింగ్ సమాచార వ్యవస్థను ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.యాదగిరి తెలిపారు. చెంగిచర్ల ఆర్టీసీ డిపోను శనివారం ఆయన సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మెట్రో బస్సులకే పరిమితమైన ఈ సిస్టంను రాష్ట్రంలోని అన్ని బస్సులకు అమర్చనున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇంటి నుంచి పరీక్ష సెంటర్ వరకు ఆర్టీసీ ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. చెంగిచర్ల డిపో మేనేజర్ ఈసు, అసిస్టెంట్ మేనేజర్ సాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బస్ సర్వీస్ ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్



బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

మంతాపూర్: డివిజన్ పరిధిలోని అంతర్గత కాలనీలకు, బస్తీలకు వచ్చే ఆర్టీసీ బస్సు సర్వీసులను లాక్‌డౌన్ సమయంలో పూర్తిగా నిలిపివేసి ఇప్పటి వరకు ప్రారంభించలేదని, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సాక్షిలో ఈ నెల 19న ప్రచురించిన బస్తీకి బస్సు ఎప్పుడో కథనానికి అధికారులు స్పందించారు. ఉప్పల్ ఆర్టీసీ డిపో అధికారులు ఈ కథనానికి స్పందించి శుక్రవారం నుంచి 18ఆర్ నెంబర్‌తో స్థానిక చర్చి కాలనీ నుంచి రాజేంద్రనగర్ ఆర్టీసీ కాలనీ ద్వారా సికింద్రాబాద్‌కు వెళ్లే బస్సులను ప్రారంభించారు. సాక్షి కథనంతోనే బస్సులు తిరిగి ప్రారంభమయ్యాయని, స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను కథనాల ద్వారా పరిష్కరిస్తున్న సాక్షికి ఆర్టీసీ కాలనీ సంక్షేమ సంఘం, చర్చి కాలనీ సంక్షేమ సంఘం, బాలాజీనగర్ సంక్షేమ సంఘం నేతలు పసూల ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, చిన్నా రావు, బుర్ర మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

సందడిగా కార్పొరేటర్ల స్పోర్ట్స్ మీట్



ఎమ్మెల్యే చేతుల మీదుగా షీల్డు అందుకుంటున్న కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ల స్పోర్ట్స్ మీట్‌లో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ప్రతిభ కనబరిచారు. బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్ విభాగాల్లో ఆమె విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి చేతుల మీదుగా పది వేల రూపాయల నగదు బహుమతితో పాటు షీల్డు, ప్రశంసాపత్రాలను ఆమె అందుకున్నారు. మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయ బహుమతి సొంతం చేసుకున్నారు. క్రీడా పోటీలు ఎంతో సంతోషాన్ని కలిగించాయని, ఇలాంటి పోటీలను తరచూ నిర్వహించాలని ఈ సందర్భంగా వారు అన్నారు.



బహుమతి, ప్రశంసాపత్రం అందుకుంటున్న కార్పొరేటర్ ప్రభుదాస్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రామంతాపూర్: రామంతాపూర్ వివేక్‌నగర్ మహిళా భవన్‌లో శనివారం పొదుపు సంఘాల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు బహుమతుల అందచేశారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకాలు మహిళలకు అందేవిధంగా పొదుపు సంఘాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సరిత, స్వప్న, జానకి, భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కళాకారులు వివిధ ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. కళాంజలి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఫీస్ట్‌లో భాగంగా ఉప్పల్ మినీ శిల్పారామం వేదికగా ప్రదర్శించిన భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణేశ్‌స్తుతి, అలరిపు, శివస్తుతి, నటేశ కౌతకం, కథక్ నృత్యాలను రవీంద్ర శిష్యం బృందం ప్రదర్శించింది. సరస్వతి వందన, తీన్తాల్, తరణ, కూచిపూడి నృత్యాలను వేదాంత సత్య నృసింహ శాస్త్రి శిష్య బృందం ప్రదర్శించి మెప్పించారు.

ధర్నాకు తరలిన బీజేపీ శ్రేణులు

మల్కాజిగిరి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ధర్నా చౌక్ వద్ద చేపట్టిన ధర్నాకు మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌తో పాటు పలువురు నాయకులు తరలి వెళ్లారు. ఆయన వెంట విఠోబా, మురళీగౌడ్, చిన్న వెంకటేష్, హరీష్, క్రిష్ తదితరులు ఉన్నారు.

మౌలాలి: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ లీకేజీ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరుద్యోగ మహాధర్నాకు వినాయక్‌నగర్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి హాజరయ్యారు. లీకేజీ వ్యవహారంలో నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మల్కాజిగిరి అభివృద్ధి



అల్వాల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందిందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా శనివారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ నగర్, కానాజీగూడ తదితర ప్రాంతాల్లో శ్రీధర్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నిమ్మ అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్‌యాదవ్, చంద్రశేఖర్, సీఎల్.యాదగిరి, కృష్ణగౌడ్, సంజీవ్‌కుమార్, ప్రభాకర్, సుధాకర్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు బాధితులకు అండగా నిలవండి



బోడుప్పల్: ప్రభుత్వ తప్పిదంతో అగమ్యగోచరంగా మారిన బోడుప్పల్ వక్ఫ్ బోర్డు బాధితులకు అండగా నిలవాలని కోరుతూ శనివారం వక్ఫ్ బోర్డు బాధితుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని గాంధీభవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 26న బోడుప్పల్‌లోని బొమ్మక్ వి.వి.ఎస్ గార్డెన్‌లో నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాలని కోరారు.

‘తీన్మార్ మల్లన్న అరెస్టును ఖండిస్తున్నాం’



మేడిపల్లి: క్యూ న్యూస్ అధినేత తీన్మార్ మల్లన్న అరెస్టును మున్నూరుకాపు సంఘం తీవ్రంగా ఖండించింది. శనివారం పీర్జాదిగూడలోని మల్లన్న ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను సంఘం ప్రతినిధులు పరామర్శించారు. పీర్జాదిగూడ, బోడుప్పల్, పోచారం మున్సిపల్ మున్నూరుకాపు సంఘాల ప్రతినిధులు వారిని పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో రమేష్, కోట్ల శంకర్, మామిడి వెంకటేష్, ఉదయగిరి సధాకర్, సంకూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకే పోషణ పక్షం

మల్లాపూర్: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే పోషణ పక్షం కార్యక్రమం ఉద్దేశమని అల్వాల్ ప్రాజెక్ట్ సీడీపీవో స్వాతి అన్నారు. శనివారం మల్లాపూర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గుడ్లు, పాలు, ఆకు కూరలు, పప్పు దినుసులు తీసుకుంటే ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటమ్మ, సూపర్‌వైజర్ జయషీలా, అంగన్‌వాడీ టీచర్లు వాణి, నాగరాణి, విజయ, మమత, స్వరూప, హిమబిందు, అనూరాధ, సుజాత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



కార్పొరేటర్‌కు సమస్యల గురించి వివరిస్తున్న కాలనీవాసులు

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలోని రాజీవ్ వీకర్ సెక్షన్ కాలనీలో శనివారం స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ, జలమండలి సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న మురుగు కాలువలు, రోడ్లు, విద్యుత్ తీగలు వేలాడడం, స్తంభాల తరలింపు వంటి సమస్యలను ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆమె సూచించారు.

మార్పులకు అనుగుణంగా పాఠ్యప్రణాళిక ఉండాలి



హెచ్‌టీసీ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కొమరయ్య

మల్లాపూర్: ప్రస్తుతం విద్యారంగంలో సమూల మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులకు పాఠ్యప్రణాళిక ఉండాల్సిన అవసరం ఉందని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యా సంస్థల అధినేత మల్కా కొమరయ్య అన్నారు. శనివారం నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో హైదరాబాద్ టుడే కాన్‌క్లేవ్ (హెచ్‌టీసీ ఎక్స్‌పో) కార్యక్రమం నిర్వహించారు. జాతీయ విద్యా విధానం 2020 విజన్ టు యాక్షన్‌పై విస్తృతంగా చర్చించారు. ఈ చర్చలో విద్యా వ్యవస్థ, కంప్యూటర్ టెక్నాలజీపై మల్కా కొమరయ్య మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సెక్యూరిటీ, ఆరోగ్యం, వాతావరణ మార్పులు, లెర్నింగ్ గ్యాప్స్, ఐసీటీ ముఖ్యపాత్ర, ఉపాధ్యాయుల క్లాస్ రూమ్ మెథడాలజీలపై యాక్షన్ రీసెర్చ్ ప్రతిపాదనలను అందజేశారు.